క్లుప్తంగా

గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని వర్దరాజుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వంగాల తిరుపతిరెడ్డి ఇటీవల మరణించగా, ఆయన కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన రాజవ్వ, లాస్య, రవికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు స్వామి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, చక్రి రాజవ్వ, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, రాములు, సునీత, దేవకి బదిలీ అయ్యారు. శుక్రవారం వారిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికి, బదిలీపై వచ్చిన వరప్రసాద్, లలిత, నాగమణి, యాదయ్యలకు స్వాగతం పలుకుతూ సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. విధి నిర్వహణలో చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వాణి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ (ఏ)లో చేర్చాలి



వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌లు

సిద్దిపేటరూరల్: ముదిరాజ్ కులస్తులను బీసీ (డి) నుంచి (ఏ)లోకి చేర్చాలని కోరుతూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నారాయణరావుపేట మండల తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ధర్మ ముదిరాజ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ (డి) నుంచి (ఏ)లోకి చేరుస్తామని హామీ ఇచ్చారన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ముదిరాజ్ సంఘం మండల నాయకుడు విద్యాసాగర్ కోరారు. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం మిరుదొడ్డి డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌కు వినతి పత్రం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఎంపీడీఓగా కె.ప్రవీణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిజామాబాద్ జిల్లా మోస్రా నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక అధికారులను అప్రమత్తం చేస్తామని తెలిపారు. కాగా ఇక్కడ పనిచేసిన లక్ష్మప్ప నంగునూరు మండలానికి బదిలీ అయ్యారు.

టై, బెల్ట్‌లు అందజేత

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లద్నూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీలను అందజేశారు. రాజిరెడ్డిని హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దాసరి పద్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు జీడికంటి సుదర్శన్, రామడుగు బాలరాజు, ఉపసర్పంచ్ కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ...

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల్‌కు చెందిన మసిరికాడి హేమలత అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయగా ప్రభుత్వం స్పందించి రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేసింది. పత్రాలను దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడి లబ్ధిదారు కుటుంబానికి శుక్రవారం అందజేశారు.

గిరిజన అభివృద్ధిపై చర్చించాలి

గజ్వేల్‌రూరల్: అసెంబ్లీలో దళిత, గిరిజన సమగ్ర అభివృద్ధిపై చర్చించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌కు విన్నవించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో శుక్రవారం దేశపతి శ్రీనివాస్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ఎస్సీ జనాభా ప్రకారం, అలాగే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కేటాయింపు చట్టం 2017 ప్రకారం నిధులు కేటాయించాలన్నారు.

సుందరీకరణకు ప్రణాళికలు

- కనువిందు చేయనున్న ఎల్లమ్మ చెరువు
- అభివృద్ధి పనులకు రూ.20 కోట్లు మంజూరు
- నగరాలను తలపించేలా జంక్షన్ల నిర్మాణం
- మున్సిపాలిటీకి స్వాగతం పలికేలా ఆర్చీలు

హుస్నాబాద్ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇటీవల మున్సిపాల్టీ పాలకవర్గ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి సమక్షంలో అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ పట్టణ సుందరీకరణపై డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు రూ.165 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించారు. ఎల్లమ్మ చెరువు, జంక్షన్లు, స్వాగత ఆర్చీలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.36 కోట్లతో మంత్రి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తొలి విడతగా టీయూఎఫ్‌ఐడీసీ కింద రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో మిగతా రూ.16 కోట్లు మంజూరవుతాయని వెల్లడించారు.



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువును కాకతీయుల కాలంలో నిర్మించారు. 1.5 కిలో మీటర్ల పొడవు కట్టతో వంద ఎకరాల్లో జలకళతో ఉట్టిపడుతుంది. ఈ చెరువు నుంచి దాదాపు 2 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. త్వరలో గౌరవెల్లి ప్రాజెక్టు ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా గోదావరి జలాలు ఎల్లమ్మ చెరువును చేరనున్నాయి. గతంలో ఎల్లమ్మ చెరువు మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం కోసం రూ.6 కోట్లు మంజూరు కాగా, కట్ట నిర్మాణం, వెడల్పు పనులు, బతుకమ్మ ఘాట్ నిర్మించారు. అనంతరం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తర్వాత టూరిజం శాఖ నుంచి రూ.3.50 కోట్లు మంజూరు కాగా, కట్టకు ఇరువైపుల ఫుట్‌పాత్, గ్రానైట్‌తో బతుకమ్మ విగ్రహం, మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు ఫ్లోరింగ్ వేశారు. ఇవి కూడా మధ్యలోనే ఆగిపోయాయి. కొత్తగా హుస్నాబాద్ పట్టణ సుందరీకరణకు రూ.20 కోట్లు మంజూరయ్యాయి.

పర్యాటక కేంద్రంగా

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ కోసం రూ.18 కోట్లు కేటాయించారు. చెరువు కట్టకు స్వాగత ఆర్చ్, కట్ట పైన వివిధ డిజైన్లతో ఆర్చీలు, చెరువు లోపల కనువిందు చేసే గ్లాస్ బ్రిడ్జి, వివిధ రకాల బొమ్మలు, గార్డెనింగ్, పిల్లలు ఆడుకునేందుకు పార్క్, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నారు.

ప్రధాన కూడళ్ల అభివృద్ధి

పట్టణంలోని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేయనున్నారు. నాగారం రోడ్‌లో, గాంధీ చౌరస్తాలో, సబ్ స్టేషన్ సమీపంలో జంక్షన్లను ఏర్పాటు చేయనున్నారు. పట్టణానికి నాలుగు దిక్కుల్లో హుస్నాబాద్ నుంచి కరీంనగర్ రోడ్‌లో, సిద్దిపేట రోడ్‌లో, హన్మకొండ రోడ్‌లో, జనగామ రోడ్, ఎల్లమ్మ చెరువు మత్తడి వద్ద స్వాగతం తెలిపేలా నాలుగు ఆర్చీలు ఏర్పాటు చేయనున్నారు.

రోజురోజుకు పట్టణం అభివృద్ధి



హుస్నాబాద్ పట్టణం రోజు రోజుకు అభివృద్ధి చెందుతోంది. పట్టణ సుందరీకరణకు ఇటీవల రూ.20 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే పర్యాటక కేంద్రంగా మారుతుంది. ప్రధాన కూడళ్లల్లో జంక్షన్ల నిర్మాణంతో పాటుగా స్వాగత ఆర్చీలు ఏర్పాటు చేయనున్నారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు.

– ఆకుల రజిత, మున్సిపల్ చైర్ పర్సన్, హుస్నాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి



తొగుటలో మాట్లాడుతున్న విభీషణ్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ గ్రామాలను కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషిచేయాలని కోరారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): బీజేపీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అక్కి సంతోష్, యువమోర్చా మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 7వ వార్డులోని ఆరపల్లె, చింతల కాలనీలో నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటించిన కౌన్సిలర్లు ఇళ్లలోని నిల్వ నీటిని పారబోయించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా ప్రతీ శుక్రవారం పట్టణ ప్రజలు డ్రై డే పాటించాలన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటజోన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. శుక్రవారం 28వ వార్డులో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు.

దుబ్బాకలో..

దుబ్బాక: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ అన్నారు. ఫ్రైడే డ్రైడే పురస్కరించుకొని 3వార్డు చెల్లాపూర్‌లో పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: ఆరోగ్యం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. పలు వార్డుల్లో కమిషనర్ నర్సయ్యతో కలిసి డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

చిన్నకోడూరు(సిద్దిపేట): కొత్తగా పట్టాదార్ పాస్‌బుక్ పొందిన రైతులు, గతంలో పాస్ బుక్ పొంది రైతుబీమాకు దరఖాస్తు చేసుకోనివారు ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పంటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబీమాకు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయస్సుగల రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు నామిని వివరాల మార్పులు, చేర్పులను ఈనెల 30వ తేదిలోపు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, నామిని ఆధార్ జిరాక్స్ దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

యువకుడి అదృశ్యం



జీవన్

గజ్వేల్‌రూరల్: నాయనమ్మ మందలించిందని మనవడు ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు జిల్లా పాటెలి మండలం, బూర్గాల గ్రామానికి చెందిన జీవన్ (19) ఐదేళ్లుగా తన నాయనమ్మతో కలిసి గజ్వేల్ పట్టణంలో నివాసముంటున్నాడు. అతడు పట్టణంలోని ఓ స్వీట్ షాపులో పనిచేస్తున్నాడు. అర్ధరాత్రి వరకు సెల్‌ఫోన్ చూస్తుండటంతో ఈనెల 25వ తేదీన నాయనమ్మ మందలించింది. దీంతో మరుసటి రోజు పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

కోహెడ(హుస్నాబాద్): కుక్కల బెడద నుంచి కాపాడాలని మహిళలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. శుక్రవారం కోహెడలోని పోచమ్మ వీధి మహిళలు కాలినడక వెళ్తుండగా గుంపులు గుంపులుగా కుక్కలు రోడ్డు పైకి వచ్చాయి. దీంతో వారు తీవ్ర భయందోళనకు గురయ్యారు. కుక్కలు గంటల తరబడి ఉండటంతో పక్కన రోడ్డు నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయాలి

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మైపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మైపాల్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మెట్టప్రాంత రైతుల స్వప్నం గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు విడుదల చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మైపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్కన్నపేటలో శుక్రవారం పార్టీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గౌరవెల్లి భూనిర్వాసితులపై పెట్టిన అక్రమ కేసులన్నీ వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో- కన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి వీరాచారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, నాయకులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరజవాన్ల ప్రాణ త్యాగం వెలకట్టలేనిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గణపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు గడిచాయని, భారత సైన్యం ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకన్నారు. కార్గిల్ నుంచి పాకిస్తాన్ సైన్యాన్ని తరిమికొట్టే క్రమంలో భారత జవాన్లు అమరులవడం బాధాకరమన్నారు.

వ్యాసరచన పోటీలు

బెజ్జంకి(సిద్దిపేట): కార్గిల్ విజయ్ దివాస్‌ను పురస్కరించుకుని బెజ్జంకి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శంకరాచారి, కార్యదర్శి విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పానుగంటికి ఐరావతం అవార్డు



అవార్డు అందుకుంటున్న తిరుపతయ్య

మద్దూరు(హుస్నాబాద్): హైదరాబాద్‌కు చెందిన శ్రీ ప్రగతి ఫౌండేషన్ విశేష సేవలందించే వారిని గుర్తించి ఏటా అవార్డులు అందజేస్తోందని మద్దూరులోని ఆంజనేయస్వామి, రామాలయ అర్చకుడు పానుగంటి తిరుపతయ్య తెలిపారు. శుక్రవారం తనకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఫౌండేషన్ ప్రతినిధులు, సినీప్రముఖుల చేతులమీదుగా జ్యోతిష్య, అర్చక రత్నాకరం బిరుదుతోపాటు బంగారు ఐరావతం అవార్డు అందజేశారన్నారు. అవార్డు అందుకున్న తిరుపతయ్యను గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర ప్రజలను వంచించే బడ్జెట్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



సిద్దిపేటలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను వంచించే బడ్జెట్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సిద్దిపేటలో గాడిద గుడ్డు ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.90 లక్షల కోట్ల బడ్జెట్ అని చెప్పి అందులో రూ.70 వేల కోట్లు అప్పు తెస్తామని చెబుతున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎఫ్‌ఆర్బీఎం పరిమితికి మించి అప్పులు చేశారని చెప్పి, ఇప్పుడు మీరెలా అప్పులు తెస్తారని ప్రశ్నించారు. కొడంగల్‌కు రూ.4వేల కోట్లు తీసుకెళ్లే రేవంత్‌రెడ్డి సిద్దిపేట తెలంగాణలో లేదా? అని ప్రశ్నించారు. ఇది అంకెల గారడీ బడ్జెట్ అని అన్నారు.

నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ..

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించింది

గజ్వేల్‌రూరల్: అధికార పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. బడ్జెట్‌లో గజ్వేల్ అభివృద్ధికి సరిపడా నిధులను కేటాయించలేదంటూ శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు.

PUBLIC NOTICE

The public in general are here by informed that Sri Kola Venu Gopal son of Narsa Goud, Resident of Marpadaga (V), R.M. Kondapak, District Siddipet has approached my client bank for sanction and release of loan for the property of under construction house situated in Sy. No. 54 with plot No. 78 area measuring 121-00 Sq. Ya. at Ponnala (V), R.M. Siddipet, District Siddipet and further informed that original link document bearing No. 4024 of 1997 of SRO, Siddipet was lost and filed police certificate issued by SHO, III Town Police Station, Siddipet. The public are informed to submit objections if any within (7) days of this publication to me for mortgaging the above property in favour of my client-bank. If no objections are received within the above stipulated time, it shall be deemed that there are no objections and my client will proceed further. Later no objections will be entertained.

K. SHIVA CHARAN
ADVOCATE
SIDDIPET, DISTRICT SIDDIPET.

తెలంగాణ ప్రజలపై వివక్ష సరికాదు



మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించడంలో వివక్ష చూపడం దారుణమని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంపై మోదీ వివక్ష చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపడాన్ని నిరసిస్తూ శుక్రవారం పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిరంజీవులు, కౌన్సిలర్లు లింగం, నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులలో తెలంగాణకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్లకార్డుల ప్రదర్శనతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను కేంద్రానికి పంపితే కేంద్రం బడ్జెట్ కేటాయింపులలో నిరాశను మిగిల్చిందన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు వెంటనే వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నిధులు కేటాయించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం పాత బస్టాండ్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి 7.3 శాతం నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. 30 శాతం కేటాయిస్తే విద్యారంగ అభివృద్ధి సాధ్యమని, గత ఆరేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఆలోచించి విద్యారంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు భరత్, రాహుల్, ప్రశాంత్, రంజిత్, రాజు, రవి, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 167 మందికి రుణమాఫీ

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకం ద్వారా పీఏసీఎస్‌లో 167 మంది రైతులకు లబ్ధి చేకూరిందని చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 167 మంది రైతులకు రూ 55.83 లక్షల రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీ పొందిన రైతులు తమ డ్యాక్యుమెంట్లు అందజేసి తిరిగి రుణాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ గంగారెడ్డి పాల్గొన్నారు.

◆ హామీలు అమలు చేయాలి

హుస్నాబాద్‌రూరల్: ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని నిలదీస్తామని మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లెలగడ్డలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో పేదల సంక్షేమం మరిచి అంకెల గ్యారడీ చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గద్దల రమేశ్ పాల్గొన్నారు.

◆ మహిళలకు ఉచిత శిక్షణ

సిద్దిపేటకమాన్: ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, మగ్గం వర్క్, టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు వడ్డెపల్లి స్వరూపరాణి తెలిపారు. ఆగస్టు 3వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తిగల మహిళలు తమ వివరాలు, ధ్రువపత్రాలతో పాతబస్టాండ్ వద్ద ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

◆ నిరుద్యోగులకు న్యాయం చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): జిల్లాల పునర్విభజనలో నష్టపోయిన నాలుగు మండలాల నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు తూముల రమేష్ శుక్రవారం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాలతో బెజ్జంకి, కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల నిరుద్యోగులు సింగరేణి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హతకోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్య వివరించగా సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నిరుద్యోగులకు అవకాశం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, బెజ్జంకిని కరీంగర్ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

◆ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటజోన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికుల ఇబ్బందుల మేరకు పాత పద్ధతిలో గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ బోర్డ్, సలహా మండలిని ఏర్పాటు చేయాలని కోరారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు ప్రతీనెల రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

◆ ఘనంగా మహిషాసుర మర్ధిని జాతర

గజ్వేల్‌రూరల్: శ్రీమహిషాసుర మర్ధిని అమ్మవారి జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. మండల పరిధిలోని బెజుగామ గ్రామంలో ఏటా ఆషాఢమాసంలో జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం జరిగిన గావురంగం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

◆ ప్రజలకు అండగా నిలవాలి

గజ్వేల్‌రూరల్: బీజేపీని అక్కున చేర్చుకున్న ప్రజలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన పట్టణ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో గజ్వేల్ ఆదర్శంగా నిలుస్తుందనుకున్నప్పటికీ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూకబ్జాలు పెరిగాయని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

◆ భూనిర్వాసితులను ఆదుకోవాలి

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ భూనిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో మల్లన్న సాగర్ భూనిర్వాసితులకు నిధులు కేటాయించాలన్నారు. భూబాధితులను ఆదుకుంటామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి విఫలమైందన్నారు. ప్రాజెక్టు నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయి పరిహారం అందక ఇబ్బందులుపడుతున్నారన్నారు. పరిహారం అందించని పక్షంలో ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.